# ఇతిహాసం

మెతుకు మనోహర్ రెడ్డి

"రేపు మన స్కూల్ల సరిగ్గ పాఠాలు చెప్పుతుండ్రా లేదా అని ఇన్‌స్పెక్షన్‌కు వస్తుండ్రు, జిల్లా పరిషత్తు నుంచి. పోయిన యాడాది మన స్కూల్ల ఆరవయి మంది పదోతరగతిల ఇమ్తెహాన్‌కు కూసుంటె ఇద్దరే కామ్యాబ్ అయ్యిండ్రు. ఈ సారి మదర్సాల పేరు చెడగొట్టద్దు. దానికి పునాది ఇప్పటి నుండి ఏద్దాం" అంటూ హెడ్మాష్టరు ఉపన్యాసం ఇస్తుండగ, వెంకట్‌రెడ్డి టీచర్ ఎనుక వరుస నుండి లేచి.

"సార్! ఇది అన్యాయం. మనం రేపే వాగుల దావత్ చేసుకుంటున్నం గద"

"దావత్‌లు ఆదివారం ఆదివారం చేసేటుంటున్నం గదయ్యా"

"అదిగాదు సారు. ఎనిమిది కోడిపుంజులు, మూడు బీరుకేసులు నిన్ననే జనగామ నుంచి తెప్పించి మా ఇంట్ల ఉంచిన"

"ఇంకో నాల్గు రోజులకు దావత్ జేసికుందాము"

"నా పెండ్లాము తోటి ఇంట్ల, కోటిపుంజుల తోటి బయట బాధపడాల్నా బడిల పోరగాండ్లకు పాఠాలు జెప్పాల్నా. మల్లోసారి నేను ఈ బాధ్యత తీసికోను"

రామస్వామి టీచర్ మధ్యలో కల్పించుకుని "హెడ్మాష్టరు గారూ! జిల్లా పరిషత్ చేరుమన్‌గారు మన సర్పంచ్‌గారికి చుట్టమేనాయె. పైరవీ జేసి ఇన్‌స్పెక్షన్ పోస్టుఫోన్ జేయించుండ్రి. నాగ్గూడ రేపు కొద్దిగ పనున్నది. నారుపీకించి పెట్టిన. కూలోల్లకు అడ్వాన్సు పైసలిచ్చిన. మీరైతే జూస్తనే ఉన్నరు. నేను, పురుషోత్తంరావుసారు బురద బట్టలతోనే పొలంనుండి డైరెక్టుగ, అన్నంతినకనే బడికి వత్తుండగ. మేరేమన్న జేసికోండ్రి నేను రేపు రాను"

హెడ్మాష్టర్ బతిమిలాడుతూ మీ అందరు జెప్పింది ఎప్పుడన్న కాదన్ననా. మీరు డేట్‌లేని లీవు అప్లికేషన్ ఇచ్చిపోతే మల్లా వచ్చినంక మీకే ఇచ్చేసి హాజర్ ఏయలేదా, సంతకం పెట్టనీయలేదా! స్కూల్ బిల్డింగుల పత్తాలు ఆడుకోనియ్యలేదా. దావతులు జేసికోనియ్యలేదా. లేటుగ రానియ్యలేదా. ఇటువంటి టైములనన్న సరిగ్గ పనిజేయకపోతే ఎట్లా. జిందగీల ఒక్కసారంటే ఒక్కసారి ఇటువంటి పనిజేసే ఛాన్సు మనకు వత్తది. ఇంతలోకే నర్సింగరావ్ సారు లేసి సారు! ఇప్పటికే పొద్దుపోయింది. పత్తాలాడేటయిమయింది. ఇన్‌స్పెక్షన్‌తో బడి ఉద్దరించేదా, పోరగాండ్లు బాగుపడేదా. వాళ్ళ అయ్య అవ్వే లకే సదువురావాలే. పోరగాండ్లకు అనేది లేదు అని అన్నడు.

హెడ్మాష్టర్ ఏడ్పుమొకం బెట్టిండు చేతులెత్తి దండం బెడ్తున్న. అందరు పిల్లగాండ్లను రేపు నీటుగ డ్రెస్సు చేసికొని రమ్మనుండ్రి. పాఠాలు బాగా సదువుకొమ్మనుండ్రి. పదవ తరగతి పిల్లలను శ్రద్ధ ఇంక ఎక్కువ జూపెట్టుమనుండ్రి. గండం ఎట్ల గట్టెక్కిస్తరో మీ భారం. నా పైసలు పెట్టి యాటపిల్లను గోసి, తాటికల్లుతో వాగులదావత్ ఇస్త మీకందరికి మీరిదిగిట్ట సక్సెసు జేయిస్తే" అని అన్నడు.

అందరు సార్లు హుషారుగ తప్పకుండ సహాయం జేత్తమని ఎవరి క్లాసులల్లకు వాళ్ళు పోయిండ్రు. మీటింగుల అనుకున్నట్లు పిల్లలకు క్లాసులల్ల చెప్పిండ్రు. పిల్లలు తలకాయ ఊపిండ్రు.

* * *

మర్నాడు ఇన్‌స్పెక్షన్ కోసం ఆఫీసర్లు వచ్చిండ్రు. అతిథి మర్యాదలు అయినయి. పదవతరగతి లోపలికి పోయిండ్రు టైంగాంగనే. వచ్చిన ఒక ఆఫీసరు తెలుగు పుస్తకం తీసికున్నడు. ఉపన్యాసం మొదలు పెట్టిండు.

"మన ఆది గ్రంథం రామాయణం శానామంచిగ రాసిండ్రు మనదేశంల ఈ హిందూమతం ఇట్లున్నదంటే రామాయణమే కారణమన్నడు. నేనొక ప్రశ్న అడుగుతను "ఒక విద్యార్థి దిక్కుజూసి" రామాయణాన్ని ఎవలు రాసిండ్రు?" అని అడిగిండు.

ఆ పిల్లగాడు చేతులు గట్టుకొని నిల్సొని వాళ్ళక్లాసు టీచర్ వెంకట్‌రెడ్డి సార్ దిక్కు చూసిండు. సారు ఏమో సైగ జేసిండు. ఇది ఇన్‌స్పెక్టర్ గూడ జూసిండు. బిగ్గరగ అన్నడు "రామాయణాన్ని నేను రాయలేదు సారు" అని.

"నెక్స్ట్" అని ఇన్‌స్పెక్టర్ అన్నడు. ఇంకోపిల్లగాడు లేచి నిల్సొని "నేను గూడ రాయలేదన్నడు"

ఈ జవాబువిని క్లాసు టీచర్ వెంకట్‌రెడ్డి బాగ ఖుషీ అయ్యిండు. ఇన్‌స్పెక్టర్ ఏడెనిమిది మందిని లేపి నిల్సోపెంచిండు. అందరు గూడ "రామాయణాన్ని నేను గూడ రాయలేదన్నరు"

ఇన్‌స్పెక్టర్, వెంకట్‌రెడ్డి మొకం జూసి మీరే ఎవల్నయిన అడుగుండ్రి అన్నడు. ఆడిపిల్లలు గూడ అబద్ధమాడరనుకొని "రాధమ్మా! చెప్పమ్మా! రామాయణాన్ని ఎవలు రాసిండ్రో" అన్నడు.

నాల్గువంకరలు దిరుక్కుంట ఓ రెండు జడలేసుకొన్న అమ్మాయి, సగం లేచి లేవనట్లుగ నిల్సొని మెల్లగా "నేను గూడ రామాయణం రాయలేదు" అన్నది.

ఇన్‌స్పెక్టర్‌కు కోపమొచ్చి హెడ్మాష్టర్‌ను పిలిపించిండు. ఆయన గజగజ వనుక్కుంట వచ్చిండు. క్లాసుటీచర్ అన్నడు. "సారూ! కోపానికి రాకుండ్రి. ఈ పిల్లలు అబద్ధమాడేటోల్లుగాదు. సరిగ్గ బడికివత్తరు. పాఠాలు సదువురు. నిజంగనే సారు రామాయణాన్ని ఈ క్లాసు పిల్లలు రాయనేలేదు. హెడ్మాష్టరు గూడ చేతులు గట్టుకొని" వెంకట్రెడ్డిసారు గూడ చాలా శ్రద్ధతో బడికి వస్తడు. పాఠాలు చెప్తడు. తెలుగుపండితుడు సారు. బి.ఓ.ఎల్ పాసయ్యిండు. ఎప్పుడు అబద్ధమాడడు. ఈ స్కూల్ల టీచర్లందర్ చాలా స్ట్రిక్ట్. వెంకట్రెడ్డి సారు చెప్పింది నిజమేసారు! ఈ క్లాసు పిల్లలు రామాయణం రాయలేదు. వెంకట్రెడ్డిసారు గూడ రాయలేదు" అన్నడు వనుక్కుంట.

"మరి ఎవలు రాసిండ్రు?"

హెడ్మాష్టర్‌కు ఏడుపు వచ్చినంత పనయింది. "సారు! నేను రామాయణాన్ని రాయలేదు సారు!" అన్నడు. ఇన్‌స్పెక్టర్ లాభం లేదనుకున్నడో ఏమోగాని ఓ పెద్దరిపోర్టు రాసుకున్నడు. క్లాసుపిల్లలను బాగా సదువుకోమన్నడు. ఇట్లుంటే సాల్ ఆఖీర్ ఇమ్తెహాన్ ఎట్లా ఖామ్యాబ్ అయితరన్నడు. పన్నెండు గంటల్దాక అన్ని క్లాసులు జూసుకొని పోయిండు జీపుల. మా హెడ్మాష్టర్ ఇన్‌స్పెక్షన్ శాన మంచిగయినందుకు వాగుల టీచర్లకు దావత్ ఇచ్చిండు యాటకోసి తాటికల్లుతో.

* * *

ఇన్‌స్పెక్టర్ జిల్లా పరిషత్ చేర్మన్‌కు పెద్దరిపోర్టు ఇచ్చిండు. అది ఇట్లున్నది "ఆ స్కూల్ల రామాయణము మేమురాయలేదంటే మేము రాయలేదంటున్నరు. పిల్లలు, టీచర్లు, హెడ్మాష్టర్ గూడ మేము రాయలేదన్నరు. దీని సంగతి, స్కూలు నడవడి తెలుసుకొనెటందుకు ఒక కమిటీ ఎయ్యాలె"

చేర్మన్ మాత్రం ఏం జేత్తడు. ఆయనకు ఎన్నో పనులుంటయి. ఎన్నో యాపకాలుంటయి. అయినా గూడ

నాల్గు వంకరలు తిరుక్కుంటూ ఓ రెండు జడలేసుకున్న అమ్మాయి సగం లేచి తనకడ్డుగా నిల్చుని మెల్లగా "నేనుగూడ రామాయణం రాయలేదు" అన్నది. ఇనస్పెక్టర్‌కు కోపమొచ్చి హెడ్మాస్టర్‌ను పిలిపించాడు...

ఆ స్కూలు మీద శ్రద్ధ చూపెట్టిండు. ఓ కమిటి ఏసిండు. ఆ ఇన్స్పెక్టర్‌నే ఆ కమిటీకి చేర్మన్ చేసిండు. సరిగ్గ రిపోర్టు ఇయ్యాలె అన్నడు. కమిటీ మెంబర్లు పదిగేను రోజుల మొహ్లత్ అడిగిండ్రు. బత్తాలు అడ్వాన్సులు తీసికున్నరు. శ్రద్ధగా అందరుగలిసి ఆ బడికి పోయిండ్రు మళ్లా.

* * *

ఊళ్లె, సర్పంచ్‌ను కలిసిండ్రు. దావత్ దిన్నరు. కర్నాన్ని కలిసిండ్రు. దావత్ దిన్నర్. గౌండ్లోల్లను కలిసిండ్రు. తెనుగోళ్లను కలిసిండ్రు. కూళోల్లను కలిసిండ్రు. హెడ్మాష్టర్‌ను, టీచర్లను, పిల్లలను, పొరుగూరు పిల్లలనుకలిసిండ్రు. ఆ వూరి సర్పంచ్ ఇట్లా చెప్పిండు "ఇక్కడి పిల్లలు శానాహుషార్. మా యువజన సంఘం మొన్న ఆటలపోటీలు జరిపింది. ఎక్కడెక్కడి నుండో వచ్చిండ్రు. కామారెడ్డి గూడెం నుండి, తొరూరు నుండి గూడ వచ్చిండ్రు. సూర్యాపేట నుంచి, జనగామ నుంచి వచ్చిండ్రు. ప్రయిజులన్ని మాకే వచ్చినయి. డాన్సులు గూడ జేసిండ్రు. అండ్ల గూడ మా ఆడపిల్లలకే ఫ్రయిజు వచ్చింది. బాగా చదువుతరు పిల్లలు. మా హెడ్మాష్టర్ ఆయన పనేదో ఆయన జేసికుంటడు. రోజుపొద్దుగాళ్ల మా ఇంటికి వచ్చే బడికిపోతడు. నాకు నమస్తేలు పెడ్తడు. చాన మంచోడు. మీరు మంచిగ రిపోర్టు రాయిండ్రి. మా స్కూల్ పేరు చెడగొట్టకుండ్రి. మేం శాన కష్టపడి హైస్కూల్ జేసినం. కడవెండిలగూడ హైస్కూల్ లేదు. నాకు కొర్దిగ జూపెట్టుండ్రి రిపోర్టు రాసినంక" అని చెప్పిండు.

కర్నంగారు మొన్ననే నౌఖరి పోయిందని ఖుశీగలేడు. ఆయన గూడ మంచిగనే చెప్పిండు స్కూలు గురించి. ఆ ఊళ్లె అందరు ఒకటిగూడ స్కూలు గురించి వ్యతిరేకంగ చెప్పలేదు. పదిగేను రోజులు గడిపి బాగా సంగతులు స్కూలు గురించి తెలిసికొని బాగా దావత్‌లు తిని పోయిండ్రు కమిటీ మెంబర్లు.

* * *

జిల్లా పరిషత్ చేర్మనుగారికి ఇట్లా రిపోర్టు ఇచ్చిండ్రు. "ఆ ఊరు శానా మంచిది. స్కూలుకు సహాయం జేస్తరు. సర్పంచ్‌గూడా శానామంచోడు కర్నంమొన్ననే నౌకర్ మీదికెల్లి పోయినగూడ స్కూలు అభివృద్ధికి సహాయం చేసెటోడే. హెడ్మాష్టర్ శానామంచోడు. టీచర్లు, పిల్లలుగూడ శానామంచోళ్లు. స్కూలుకు సరిగ్గ వస్తరు. ఆటలపోటీలల్ల, సాంస్కృతిక కార్యక్రమాలల్ల మంచిగ ప్రయిజులు గొడ్తరు. మాగ్గూడ నిజమేననిపించింద. వాళ్లెవరు అబద్ధమాడరని. నిజంగనే రామాయణం ఆ బడిలో ఎవ్వలు గూడ రాయలేదు. హెడ్మాష్టర్, టీచర్లు, పిల్లలు ఎవ్వలు గూడ రాయలేదు. మేం అందరిని తెలుసుకున్నం. బడిబాగ పనిజేస్తున్నది.

పిల్లలు శ్రద్ధగ చదువుతున్నరు. లాస్ట్ ఇయర్ నతీజ సరిగ్గరాలేదని ఈ సారి అందరు శ్రద్ధగ ఉన్నరు. ఈ సారి నతీజ సరిగ్గవస్తదని ఆశపడుతున్నరు. మేం ఆ బడిల కన్గొన్నది ఏమిటంటే ఆ బడిల రామాయణం ఎవ్వలు గూడ రాయలేదు" ఇంకా శాన శాన రిపోర్టు ఇచ్చిండ్రు.

మీరుగూడ ఈ రిపోర్టు చూడాలనుకొంటే, జిల్లా పరిషత్‌కు పోయి ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు పోండ్రి. చెప్రాసి చేతుల్ల పదిరూపాయలు పెట్టుండ్రి. 789వ ఫైలు ఇమ్మనుండ్రి, ఎవ్వలుజూడకుంట. ఆయన అటీటు చూసి రూపాయలు దీసికొని జేబులపెట్టుకుంటడు. అటీటుచూసి, మెల్లగ ఆ ఫైలు తెచ్చి ఇస్తడు. ఓ మూలకు కొంటెన్ల కూసోని మొత్తం ఆ బడిసంగతి తెలుసుకోండ్రి. పిల్లలు అబద్ధమాడరని కూడ తెలిసికోండ్రి. ఇప్పుడు మనదేశంల నడుస్తున్న జరుగుతున్న ఇతిహాసం గింతమంచిగ వున్నది. *

